# మార్పు



బస్సు కోఠీలో ఆగగానే సుజాత బస్సు దిగింది.

ఆమె వెనకే శేఖర్ కూడా దిగాడు.

ఆమె 'వాణి సూపర్‌బజార్'లోకి నడిచింది. ఆమె లోపలికి వెళ్లిన పదిహేను నిమిషాల తర్వాత అతనూ ఆ స్టోర్స్‌లోకి అడుగుపెట్టాడు. సుజాత పనిచేసే స్టోర్‌లోకెళ్లి ఏదో ఒకటి కొనడం అతని దినచర్య! ఆ సాకుతో ఆమెను మరింతసేపు చూడొచ్చని, మాట్లాడవచ్చని అతని ఆశ!

ఎప్పటిలాగే ఆమె పనిచేసే స్టోర్ వైపు నడిచాడు. ఆశ్చర్యం... ఆ స్టోర్‌లో యింకో అమ్మాయి వుంది.

సుజాత కోసం అన్ని స్టోర్స్‌లోనూ చూశాడు. ఆమె కనిపించలేదు.

చివరకు కేషియర్ కౌంటరు దగ్గర కనబడింది. కళ్ళు తుడుచుకుంటూ తనవైపు తిరిగిన సుజాతను చూసి, "హలో..." అన్నాడు పలకరింపుగా.

ఆమె అతని వైపు యీసడింపుగా చూసి, బయటకు నడిచింది.

ఆమెనే ఫాలో అవుతూ "హలో... ఏం జరిగింది?" అన్నాడు.

"చాలు మహానుభావా... చాలు! మమ్మల్ని ఎందుకు బ్రతకనీయరు మీ మగవాళ్ళు? మీరు రోజూ స్టోర్స్‌కు రావడం, నా డిపార్ట్‌మెంట్‌లోనే ఏదో ఒకటి కొనడం మావాళ్ళకు

నచ్చలేదు. మా మేనేజ్‌మెంట్ భాషలో నా 'ప్రవర్తన' నచ్చలేదు. నాలుగు రోజుల ఉపవాసం తర్వాత దొరికిన ఉద్యోగం- మీ పుణ్యమా... అని పోయింది. మీకూ ఉద్యోగం చేయాలని, తల్లిదండ్రులకు ఆసరాగా ఉందామని అనిపించదా? మీ సమయమంతా ఆడపిల్లల వెనుక తిరగడం తప్ప యింకో విధంగా సద్వినియోగపరచుకోలేరా? నా జీతంతోనే బ్రతికే నా తల్లీ, తమ్ముళ్ళకు రేపట్నుంచీ ఎలా అన్నం పెట్టగలను? దయచేసి యికపై ఏ ఆడపిల్ల కడుపూ కొట్టకండి!" ఆమె ఏడుస్తూనే మాట్లాడుతోంది.

శేఖర్ మనసు కలచివేసినట్లయింది. విసురుగా వెళ్లిపోతున్న ఆమెను చూసి ఏమీ మాట్లాడలేకపోయాడు.

●

తన యింట్లోకి అడుగుపెట్టిన శేఖర్‌ని చూసి ఆశ్చర్యపోయింది సుజాత.

"రండి..." అయిష్టంగానే కుర్చీ ఆఫర్ చేసింది.

"సుజాత గారూ... మీరు నన్ను క్షమించాలి! నా ప్రవర్తనకు ఎంతో సిగ్గుపడుతున్నాను. నేను నిన్ననే ఓ ఉద్యోగంలో చేరాను. అంతేకాదు, అక్కడే మీకు కూడా ఉద్యోగం చూశాను. దయచేసి యీ ఉద్యోగాన్ని తిరస్కరించకండి. మన డిపార్ట్‌మెంట్స్ వేరు కాబట్టి నేను మీకు ఎదురయ్యే అవకాశం లేదు. ఒకవేళ ఎదురుపడ్డా మీ నీడను కూడా చూడకుండా వెళ్లిపోతాను. ఇటీజ్ మై ప్రామిస్!"

ఆమె అతని వైపు ఆశ్చర్యంగా, ఆనందంగా చూసింది. అతని మాటల్లో నిజాయితీ కనిపించింది.

"థాంక్స్ !" మనస్ఫూర్తిగా అంది సుజాత.

●

'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ... 13 మార్చి' 1998